
క్లుప్తంగా

వీరాంజనేయస్వామికి విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న శ్రీవీర అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలను నిర్వహించారు. ఉదయం దేవస్థానంలో అభిషేకాలు, ఆకుపూజ, అష్టోత్తర పూజలు జరిగాయి.

బంగారు కాసులు అందజేత

పొదలకూరు: మండలంలోని మొగళ్లూరు గ్రామంలో ఉన్న భద్రకాళమ్మ దేవస్థానంలో అమ్మవారికి రాజారెడ్డి – సుకన్య దంపతులు మంగళవారం బంగారు కాసులను బహూకరించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉపాధి కూలీలకు ఈ - కేవైసీ తప్పనిసరి



మాట్లాడుతున్న ఏపీఓ రాజమ్మ

మనుబోలు: ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏపీఓ రాజమ్మ అన్నారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడారు. కూలీల్లో నకిలీలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ జాబ్‌కార్డును ఆధార్ కార్డుతో అనుసంధానం చేసుకోవాలని సూచించారు. దీంతో హాజరు విధానంలో పారదర్శకత పెరుగుతుందన్నారు. ఉపాధి పనుల్లో అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఎన్ఎంఎంఎస్ యాప్‌ను తీసుకొచ్చిందన్నారు.

నవంబర్ నాటికి తొలివిడత గృహాల పూర్తి

- హౌసింగ్ పీడీ వేణుగోపాల్



రికార్డులు పరిశీలిస్తున్న పీడీ వేణుగోపాల్

కొడవలూరు: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద తొలి విడతలో మంజూరైన గృహాలన్నింటినీ నవంబర్ నెలాఖరుకు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని హౌసింగ్ పీడీ టి.వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం ఆయన మండల హౌసింగ్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పీఎంఏవై కింద జిల్లాలో తొలివిడతలో 21,189 గృహాలు మంజూరయ్యాయని, వీటిలో 20 వేల గృహాలకు శ్లాబులు పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన 1,189 గృహాలను వచ్చే నెలాఖరులోగా పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పీఎంఏవై 2.0 పథకం కింద గ్రామీణ ప్రాంతాలకు ఇప్పటి దాకా గృహాలు మంజూరు చేయలేదన్నారు. ఈ పథకం కింద అర్బన్‌లోని 6 మున్సిపాలిటీల్లో మాత్రమే 2,538 గృహాలు మంజూరు చేశామన్నారు. ఈ పథకం కింద ఒక్కో లబ్ధిదారుడికి కేంద్రం వాటా కింద రూ.1.50 లక్షలు, రాష్ట్ర వాటా కింద రూ.లక్ష మంజూరు చేయడంతో పాటు ఉపాధిహామీ కింద రూ.29 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ పథకం కింద ఒక్కో లబ్ధిదారుకు రూ.2.79 లక్షలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 738 గ్రామాలుండగా సాంకేతిక సమస్యల కారణంగా కొన్ని గ్రామాలు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదన్నారు. బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతున్న విషయాన్ని పీడీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో ఏఈ వంశీకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉద్యోగులకు అన్యాయం

నెల్లూరు(అర్బన్): కూటమి ప్రభుత్వం కొలువు దీరాక ఉద్యోగులకు తీరని అన్యాయం జరుగుతోందని యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్‌కుమార్ ఆరోపించారు. దర్గామిట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన యూనియన్ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఆశలతో ఓట్లేసి గెలిపించిన ఉద్యోగులపై కక్షసాధింపు చర్యలకు కూటమి ప్రభుత్వం పాల్పడుతోందని విమర్శించారు. పీఆర్సీ కమిషన్‌ను వేయలేదని.. ఐఆర్‌ను ప్రకటించలేదని.. ఒక్క డీఏనూ విడుదల చేయకుండా నిరంకుశంగా వ్యవహరిస్తోందని చెప్పారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా విజయవాడలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో టీచర్లు చేపట్టిన ఆందోళన విజయవంతమైన నేపథ్యంలో, ఇప్పటికైనా తమ తప్పులను తెలుసుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించే యోచనను విరమించుకోవాలని కోరారు.

రేషన్ మాఫియా ఇష్టారాజ్యం

- యథేచ్ఛగా బియ్యం అక్రమ రవాణా
- నెల్లూరులోని మిల్లర్లకు విక్రయం
- చక్రం తిప్పుతున్న చేజర్ల మండల వాసి
- ప్రతి నెలా 90 టన్నుల వరకు సేకరణ
- ఇందుకు గ్రామాలకు ఆటోల తరలింపు



గతంలో పట్టుబడిన రేషన్ బియ్యం లారీ

పొదలకూరు: రేషన్ బియ్యం మాఫియా రెచ్చిపోతోంది. వారు సేకరిస్తున్న బియ్యం యథేచ్ఛగా తరలిపోతోంది. పొదలకూరు కేంద్రంగా మూడు మండలాలకు సంబంధించి సుమారు 90 టన్నుల బియ్యం నెల్లూరు మిల్లర్లకు ప్రతి నెలా విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందుకోసం చేజర్ల మండలానికి చెందిన ఓ వ్యక్తి రింగ్ మాస్టర్‌గా అవతారమెత్తాడు. ఆటోలను సమకూర్చి మహిళలను గ్రామాలకు ఆటోల్లో పంపుతూ బియ్యం సేకరించి అమ్మకాలు సాగిస్తున్నాడు. ఈ వ్యవహారం నడిపేందుకు పెద్ద నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నట్టు తెలుస్తోంది. సంబంధిత అధికారుల సహకారం కూడా ఉందని విమర్శలున్నాయి. రేషన్ డీలర్లు, చిల్లర దుకాణ వ్యాపారులు, ఊరూరా వెళ్లి సేకరించే వారి నుంచి ఆ వ్యక్తి బల్క్‌గా బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్నాడు. అమ్ముకుంటున్న వారికి ఒక కిలోకు రూ.15, సేకరించిన వారికి కిలోకు రూ.20 వంతున అందజేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.

టన్నుల్లో సేకరణ

పొదలకూరులో ఉన్న సివిల్ సప్లయ్స్ గోదాము నుంచి పొదలకూరు మండలంతోపాటు చేజర్ల, మనుబోలు మండలాల రేషన్ షాపులకు బియ్యం తరలిస్తున్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర అవసరాల తోపాటు మూడు మండలాల్లో ఉన్న 123 చౌక దుకాణాలకు కలిపి సుమారు గోదాముకు ప్రతినెలా 600 టన్నుల బియ్యంను దిగుమతి చేసుకుంటారు. డీలర్లు 1 నుంచి 15వ తేదీ వరకు లబ్ధిదారులకు అందజేయడం జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఒకటి, రెండు రోజుల్లో పంపిణీని ముగిస్తారు. ఈ నేపథ్యంలో డీలర్లు కొనుగోలు చేసే బియ్యంతో పాటు, ఊరూరా వెళ్లి ఆటోల ద్వారా కొందరు బియ్యంను కిలో రూ.15 వంతున సేకరిస్తున్నారు. దీనిని ఒకరికే అప్పగించి సొమ్ము చేసుకోవడం జరుగుతోంది. వీరికి కావాల్సిన వనరులను ఆ వ్యక్తి సమకూరుస్తున్నాడని చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో రేషన్ బియ్యం పట్టుకున్న దాఖలాల్లేవు. దీనిని బట్టి ఆ వ్యక్తి నెట్‌వర్క్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని డీలర్లే బహిరంగంగా అంటున్నారు.

చిల్లర దుకాణాల వ్యాపారులు సైతం

రేషన్ బియ్యంను మండల కేంద్రాల్లోని చిల్లర దుకాణాల వ్యాపారులు సైతం కొనుగోలు చేస్తున్నారు. పొదలకూరు బస్టాండ్‌లో ఓ వ్యాపారి ప్రతినెలా 600 బస్తాల బియ్యంను కొనుగోలు చేసి రింగ్ మాస్టర్‌కు అప్పగిస్తున్నట్టు తెలుస్తోంది. తద్వారా ఆ వ్యాపారి బాగానే ఆర్జిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అధికారులకు ఎక్కడ? ఎవరు? బియ్యం సేకరించి తరలిస్తున్నారో తెలిసినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. నెలవారీగా వాటాలు అందడమే కారణంగా తెలుస్తోంది.



పొదలకూరులోని సివిల్ సప్లయ్స్ గోదాము

సమాచారమిస్తే చర్యలు



రేషన్ బియ్యం అమ్మడం, కొనడం నేరం. పెద్ద ఎత్తున కొనుగోలు చేసి తరలిస్తున్న సమాచారం మాకు అందజేస్తే చర్యలు తీసుకుని కేసులను నమోదు చేయడం జరుగుతుంది. ప్రతినెలా రేషన్ షాపులను తనిఖీలు చేస్తూనే ఉన్నాం. రికార్డులను పక్కాగా నిర్వహించని డీలర్లపై చర్యలు తీసుకుంటున్నాం.

– ఐ.రవి, సివిల్ సప్లయ్స్ డీటీ, పొదలకూరు

వాల్మీకికి ఘన నివాళులు



కొడవలూరు: మహర్షి వాల్మీకి జయంతిని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డి నివాళులర్పించారు. డీటీ సారంగపాణి, ఆర్ఐ హైమావతి, మండల సర్వేయర్ మహేశ్వరరావు, సీనియర్ సహాయకుడు మస్తాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరివ్వాలంటూ నిరసన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నామంటూ స్థానిక మున్సిపల్ కార్యాలయ ఎదుట నిరసనను పాత కాశీపాళెం పీర్ల చావిడి వీధి ప్రాంత ప్రజలు మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడారు. తాగేందుకు నీరు లేక రెండు రోజులుగా ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. కట్టుబడిపాళెం నుంచి నీళ్ల ట్యాంకర్ రావడంలేదని, సమస్యను పరిష్కరించాలని కోరారు.

వైభవంగా దుర్గాదేవి గ్రామోత్సవం

- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మనుబోలు: మండలంలో దసరా ముగింపు ఉత్సవాలను సోమవారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయంలో అర్చకులు శ్రీనివాసులు అమ్మవారికి అభిషేకాలు, నవారణ పూజ, దేవి ఖడ్గమాలార్చన నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం దుర్గాదేవి రూపంలో అలంకరించిన అమ్మవారిని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు. అమ్మవారి చెంత పెట్టిన లడ్డూను వేలం వేయగా పొట్టి నాగేంద్ర రూ.40 వేలకు, పట్టుచీరను రూ.21 వేలకు పరిమళ సురేష్, నగదు మాలను రూ.17 వేలకు చల్లా వెంకటేశ్వర్లు దక్కించుకున్నారు.

జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన



పొదలకూరు: జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు కామర్స్ లెక్చరర్ వెంకటరమణారెడ్డి మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చలో విజయవాడ జయప్రదం



నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమం విజయవంతమైందని ఫ్యాప్టో నేతలు తెలిపారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో హాజరయ్యారని చెప్పారు. మధ్యాహ్న భోజనం మినహా ఎలాంటి యాప్‌లో నమోదు చేయకూడదని తీర్మానం చేశామని వివరించారు.

సోలార్ విద్యుత్‌పై విస్తృత ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న రాఘవేంద్రం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సోలార్ విద్యుత్‌పై క్షేత్ర స్థాయిలో ప్రచారం కల్పించాలని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ రాఘవేంద్రం ఆదేశించారు. జిల్లాలోని అన్ని డివిజన్లకు చెందిన ఈఈలు, డీఈఈలు, సోలార్ వెండార్లతో నగరంలోని విద్యుత్ భవన్‌లో గల స్కాడా సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ఇప్పటి వరకు 7803 దరఖాస్తులు రాగా, 2210 మందికి సోలార్ ప్యానళ్లను కేటాయించగా, వీరిలో 1873 మంది సబ్సిడీని పొందారని తెలిపారు. లక్ష్యాలను నిర్దేశించుకొని సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. సూర్యఘర్ జిల్లా నోడల్ అధికారి శేషాద్రిబాలచంద్ర, ఈఈలు శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, రమేష్‌చౌదరి, బెనర్జీ, భానూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

12న ఉచిత కంటి వైద్యశిబిరం

పొదలకూరు: పట్టణంలోని విజేత స్కూల్లో ఈనెల 12వ తేదీ ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం జరుగుతుందని కరస్పాండెంట్ జి.కామాక్షమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చాగణం లలితమ్మ భాస్కర్ రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం జరుగుతుందన్నారు. వెంకటేశ్వర అరవింద తిరుపతి కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. హాజరైయ్యే వారు ఆధార్ కార్డు జెరాక్స్ కాపీ తీసుకురావాలని సూచించారు.

పాతకక్షలతో వ్యక్తిపై దాడి

విడవలూరు: పాతకక్షలను దృష్టిలో ఉంచుకొని వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటన మండలంలోని ఊటుకూరు పంచాయతీలో గల కంచరపాళెంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కంచరపాళేనికి చెందిన కొర్నా వెంకయ్య, విడవలూరు ప్రసాద్ మధ్య గతేడాది నుంచి గొడవలు జరుగుతున్నాయి. ఇది రెండు వర్గాల మధ్య గొడవగా మారడంతో ప్రసాద్ ఊరొదిలి బెంగళూరు వెళ్లి అక్కడే ఉంటున్నారు. ఈ తరుణంలో వారం క్రితం ఆయన వచ్చారు. వెంకయ్య తారసడిన సందర్భాల్లో దూషించసాగారు. తాజాగా వెంకయ్యను దూషిస్తూ కత్తితో తలపై, భుజంపై దాడి చేశారు. దీంతో వెంకయ్యను 108లో కోవూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రసాద్‌ను ఎస్సై నరేష్ అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు.

కండలేరులో 58.930 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 58.930 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 3,600 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 500, పిన్నేరు కాలువకు 70, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

నేత్రపర్వంగా గిరి ప్రదక్షిణ

నెల్లూరు సిటీ: నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామివారికి గరుడసేవను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిప్రదక్షిణను జరిపారు. ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ



కబడ్డీ పోటీలో తలపడుతూ..

వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండు రోజుల పాటు జరిగిన మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో పూడిపర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. కబడ్డీ జూనియర్స్‌లో బాలుర జట్టు విజేతగా నిలిచింది. ఈ జట్టులోని దీపక్, ప్రవీణ్, పవన్ డివిజన్ లెవల్ గేమ్స్‌కు ఎంపికయ్యారు. బాలికల జూనియర్ కబడ్డీలో చైత్ర, సుమ, విరాజిత ఎంపికయ్యారు. 100 మీటర్ల రన్నింగ్‌లో విద్యావతి, 200 మీటర్ల రన్నింగ్‌లో చైత్ర, మధుప్రియ విజేతలుగా నిలిచారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కె.కృష్ణయ్య, పీడీ శోభ అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ



మాట్లాడుతున్న హుస్సేనమ్మ

పొదలకూరు: సీజనల్ వ్యాధులపై ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, ఆశా వర్కర్లు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ సూచించారు. ఆశా డే సందర్భంగా మండలంలోని మహ్మదాపురం పీహెచ్‌సీలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. కీటక జనిత వ్యాధుల గురించి ముందస్తుగా తెలుసుకుని జాగ్రత్తలు పాటించాలన్నారు. వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయించడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. పరిశుభ్రమైన నీటిని తాగితే అంటు వ్యాధులు రావని, కాచి చల్లార్చిన నీటిని తాగాల్సిందిగా ఆశా వర్కర్లు గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ వరలక్ష్మి, సబ్‌యూనిట్ అధికారి ఆంజనేయవర్మ, ఆరోగ్య పర్యవేక్షకులు మస్తాన్‌బీ, నరసమ్మ పాల్గొన్నారు.

మట్టిదిబ్బలు తొలగించేదెవరు?



పేరుకుపోయిన మట్టిదిబ్బలు

తోటపల్లిగూడూరు: మండలంలోని నరుకూరు – కోడూరు ఆర్‌అండ్‌బీ రహదారి వెంబడి ఉన్న మట్టిదిబ్బల కారణంగా వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. విలుకానుపల్లి సెంటర్ – కోడూరు గురుకుల కళాశాలల మధ్య ఈ రహదారి ఆనుకుని ఎల్లవ కాలువ ఉంది. ఇందులో ఇటీవల ఇరిగేషన్ అధికారులు పూడికతీత పనులు చేపట్టారు. మట్టి, చెత్తాచెదారాలను కాంట్రాక్టర్ కోడూరు రహదారి పక్కన పోయించి వదిలేశాడు. ఈ మార్గంలో నరుకూరు – కోడూరు రహదారి నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. డబుల్ రోడ్డు సైతం సరిపోవడం లేదు. దీనికితోడు కాలువ మట్టి కారణంగా వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇరిగేషన్ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

అలా వదిలేశారు!



నిరుపయోగంగా జనరేటర్

తోటపల్లిగూడూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న జనరేటర్ మరమ్మతులకు గురైంది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచినప్పుడు కార్యకలాపాలకు ఆటంకం కలుగుతోంది. పది సంవత్సరాల క్రితం ప్రభుత్వం కార్యాలయానికి జనరేటర్‌ను సమకూర్చింది. కొంతకాలంగా పనిచేయక పోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడల్లా తహసీల్దార్ కార్యాలయంలో అన్ని కార్యకలాపాలు నిలిచిపోతున్నాయి. అత్యవసర సేవలు నిలిచిపోతుండటంతో అటు అధికారులు, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేయించాల్సిన అవసరముంది.

వార్డుల విభజన సక్రమంగా లేదు



సమస్యను లేవనెత్తుతున్న కౌన్సిలర్లు



కమిషనర్‌తో మాట్లాడుతున్న ప్రమీలమ్మ

- వైఎస్సార్సీపీ కౌన్సిలర్ల ఆవేదన
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశాన్ని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. అజెండాలో పొందుపర్చిన ఎనిమిది అంశాలను సిబ్బందితో చదివి వినిపించారు. ఈ సందర్భంగా పలు సందేహాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు షాహుల్, ప్రమీలమ్మ, యానాది రెడ్డి, జయంతి, అనంతమ్మ, షకీల తదితరులు లేవనెత్తారు. వార్డులను సక్రమంగా విభజించలేదని.. సర్వే నంబర్లను చూపుతూ ఇలా చేశారని.. పోలింగ్ స్టేషన్లను సైతం పరిగణనలోకి తీసుకోలేదని వివరించారు. విభజన సమయంలో వార్డులకు సంబంధించిన ల్యాండ్ మార్క్ తదితర అంశాలను విస్మరించారని ఆరోపించారు. ఒక్కో ప్రాంతానికి ఒక్కో పేరు ఉండగా, వాటిని ఎక్కడా చూపలేదని పేర్కొన్నారు. దిక్కులను మాత్రమే తెలియజేస్తే సామాన్యులకు ఎలా అర్థమవుతుందని ప్రశ్నించారు. ప్రతి వార్డులో ఒకే సంఖ్యలో ఓటర్లు ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఒక వార్డులో ఎక్కువగా.. మరో చోట తక్కువ ఓట్లు ఉండటంతో అభివృద్ధిలో అసమానతలు ఏర్పడే అవకాశం ఉందని వివరించారు.

అభ్యంతరాల నమోదుకే సమావేశం

మున్సిపాల్టీలో పెరగనున్న వార్డులకు సంబంధించి కౌన్సిల్ సభ్యుల నుంచి అభ్యంతరాలను స్వీకరించేందుకే సమావేశాన్ని ఏర్పాటు చేశామని కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. కౌన్సిల్ సభ్యులు లేవనెత్తిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. 20 నుంచి 27 వార్డులకు పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. కొన్ని సమస్యలు ఏర్పడి ఉండొచ్చని, సభ్యులు సూచించిన మేరకు వీటిని పరిష్కరిస్తామని తెలిపారు. ఒక వార్డులో ఉన్న వారికి మరో వార్డులో ఓటు ఉంటే మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేస్తే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. వార్డుల విభజన ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కౌన్సిల్ సభ్యుల సూచనలను పొందుపర్చి తుది ముసాయిదాను ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ముంబై రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ పూడికల్లో భాగంగా తొలగించిన ఆక్రమణలను అలాగే ఉంచాలన్నారు. కాలువలు దాటి వ్యాపారులు ముందుకొస్తే కఠిన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ఐరన్ మెష్, నాపరాళ్లను తాత్కాలికంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ముంబై రోడ్డు వెడల్పు, సర్వీస్ రోడ్ల నిర్మాణానికి రూ.ఎనిమిది కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామన్నారు.

ఎనిమిది అంశాలకు ఆమోదం

వార్డుల విభజన ముసాయిదా, పట్టణంలో రూ.కోటితో చేపట్టే పనులు తదితర ఎనిమిది అంశాలకు సంబంధించిన అజెండాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారని సుప్రజ వివరించారు.

పొదుపు మహిళలకు అభినందన

టెర్రస్ గార్డెన్ పెంపకంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా అవార్డును అందుకున్న బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీ ఖాజానగర్ నాలుగో సమాఖ్య పొదుపు సభ్యులను చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ బాలకృష్ణ అభినందించారు.

ఎస్జీఎఫ్ ఎంపికలు రేపు



మాట్లాడుతున్న సునీల్‌కుమార్

ఇందుకూరుపేట: మండల స్థాయి ఎస్జీఎఫ్ టోర్నీ, ఎంపికలను కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించనున్నామని ఎంఈఓ సునీల్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడారు. అండర్ – 14, 17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్ పోటీలను కొత్తూరులో నిర్వహించనున్నామని వివరించారు. అథ్లెటిక్స్, ఖోఖో ఎంపికలను పల్లిపాడులో శుక్రవారం జరపనున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు తగిన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని, వివరాలకు కొత్తూరు పీడీ అరోరాను సంప్రదించాలని సూచించారు.